అందని వైద్య సేవలు

- ఒక్కరితోనే నెట్టుకొస్తున్నారు
- ఇబ్బంది పడుతున్న రోగులు
- అంకోలి పీహెచ్‌సీ పరిధిలో 13 సబ్‌సెంటర్లు



వైద్య పరీక్షల కోసం పీహెచ్‌సీకి వచ్చిన గర్భిణులు

ఆదిలాబాద్‌రూరల్: అసలే ఏజన్సీ ప్రాంతం. వర్షాకాలం కావడంలో ప్రజలు అనారోగ్యం బారిన పడే అవకాశం ఉంది. ఇదిలా ఉండగా ఆదిలాబాద్ రూరల్ మండలం నాలుగు దిక్కులు విస్తరించి ఉంది. మండలంలోని అంకోలి గ్రామంలో మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉంది. ఈ పీహెచ్‌సీ పరిధిలో మొత్తం 13 ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాలున్నాయి. ఆయా ఉప కేంద్రాల పరిధిలో సుమారు లక్ష 5వేల జనాభా ఉన్నారు. ఈ లెక్కాన మండలంలో ఇద్దరు మెడికల్ ఆఫీసర్‌లు ఉండాలి. కానీ గత ఏడాది నుంచి ఒక్క మెడికల్ ఆఫీసర్‌తోనే నెట్టుకొస్తున్నారు.

టూర్‌కు వెళ్తే అంతే సంగతి..

మండలంలోని అంకోలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏడాది కిందట ఇద్దరు మెడికల్ ఆఫీసర్లు ఉండే వారు. వారు పీజీ కోర్సుకు వెళ్లడంతో సిరికొండ మండలం సర్సాపూర్ (టి) పీహెచ్‌సీకి చెందిన మెడికల్ ఆఫీసర్‌ను డిప్యూటేషన్‌పై కొనసాగిస్తున్నారు. వర్షాకాలం కావడంతో ఏజన్సీ ప్రాంతాల్లోని ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉంటుంది. అందుకోసం సంబంధిత మెడికల్ ఆఫీసర్ ప్రజలు అనారోగ్యాల బారిన పడకుండా ఉండేందుకు ముందస్తు చర్యల్లో భాగంగా పలు గ్రామాలలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వైద్య చికిత్స అంజేస్తున్నారు. ఇదిలా ఉండగా.. సంబంధిత మెడికల్ ఆఫీసర్ వైద్య శిబిరాల నిర్వహణ, గర్భిణులకు, బాలింతలకు వైద్య పరీక్షలు నిర్వహించడం, ఇమ్యూనైజేషన్ పరిశీలన కోసం గ్రామాల్లో టూర్‌కు వెళ్తే పీహెచ్‌సీలో మెడికల్ ఆఫీసర్ అందుబాటులో లేక వైద్య సేవలు అంతంత మాత్రంగానే అందుతున్నాయని ప్రజలు వాపోతున్నారు.

ఉన్నవారిపై అదనపు భారం

అంకోలి పీహెచ్‌సీ పరిధి విశాలమైనది. ఒకరూ గ్రామాలకు వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహిస్తే మరొకరూ పీహెచ్‌సీకి వచ్చే వారికి వైద్య చికిత్స ఉందించాల్సి ఉంటుంది. కానీ ఇద్దరు మెడికల్ ఆఫీసర్లు ఉండవాల్సిన చోట ఒక్కరే ఉండడంతో అదనపు భారం పడుతుంది. అలాగే ఆ మెడికల్ ఆఫీసర్ టూర్‌కు వెళ్తే పీహెచ్‌సీకి వచ్చే రోగులకు అక్కడ ఉన్న స్టాఫ్ నర్సులు, వైద్య సిబ్బంది వారికి తెలిసిన మాత్రలు అందజేసి పంపిస్తున్నారు. దీంతో వారికి పూర్తిస్థాయిలో వైద్యం అందే అవకాశం ఉండదు.

ఉన్నవారితో సర్దుకుపోతున్నాం



మండలంలోని ప్రజలకు సకాలంలో వైద్య సేవలు అందిస్తున్నాం. తాను గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించేందుకు వెళ్లినప్పుడు పీహెచ్‌సీలో ఉన్న వైద్య సిబ్బంది చికిత్సలు అందజేస్తున్నారు. మరొ మెడికల్ ఆఫీసర్‌ను కేటాయించాలని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా. ప్రస్తుతమైతే ఉన్న సిబ్బందితో సర్దుకుపోతున్నాం.

– డాక్టర్ సర్ఫారాజ్, మెడికల్ ఆఫీసర్

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

తలమడుగు: మండలంలోని భీంపూర్, తలమడుగు, గుడిహత్నూర్ మండలాలకు చెందిన లబ్ధిదారులకు బుధవారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అర్లి(కె) గ్రామంలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆస్పత్రుల ఖర్చుల నిమిత్తం పేదవారికి సీఎంఆర్‌ఎఫ్ డబ్బులు ఎంతగానో ఉపయోగపడుతున్నాయన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ తోట వెంకటేశ్, కేదారేశ్వర్ రెడ్డి, కిరణ్‌కుమార్, ప్రకాష్ రెడ్డి, తిరుమల్ గౌడ్, ప్రకాష్, పాల్గొన్నారు.

రోడ్డు నిర్మించాలని ఎమ్మెల్యేకు వినతి

బోథ్: తమ గ్రామానికి రోడ్డు నిర్మించాలని మండలంలోని కుచ్చిర్యాల తండా గ్రామస్తులు ఎమ్మెల్యే అనిల్‌జాదవ్‌ను కోరారు. బుధవారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసంలో ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను కలిసి విన్నవించారు.

దుండగుడిని కఠినంగా శిక్షించాలి



నార్నూర్: రోడ్డుపై బైఠాయించిన ఆదివాసీలు

నార్నూర్/ఆదిలాబాద్‌రూరల్/ఇంద్రవెల్లి: జైనూరు మండలంలో మహిళపై అత్యాచారయత్నం చేసిన దుండుగుడిని కఠినంగా శిక్షించాలని నార్నూర్ మండల కేంద్రంలోని కుమరం భీం చౌక్ వద్ద, గాదిగూడ మండలంలోని లోకారి(కె) గ్రామంలో ఆదివాసీలు నిరసన చేపట్టారు. నిందితుడిని ఎన్‌కౌంటర్ చేయాలని ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని గొండ్‌గూడ, పర్ధాన్‌గూడలో ఆదివాసీలు డిమాండ్ చేశారు. ఆదిలాబాద్‌రూరల్ మండలంలోని బంగారుగూడలో తుడుం దెబ్బ మండల కార్యనిర్వాహక అధ్యక్షుడు అనక గంగారాం డిమాండ్ చేశారు.

ఎదులాపురం: కుమురంభీం జిల్లా జైనూర్ మండలంలోని మహిళపై అత్యాచారయత్నానికి పాల్పడిన దుండగుడిని కఠినంగా శిక్షించాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

– దుండగుడికి ఉరిశిక్ష వేయాలని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా జిల్లా నాయకులు జగన్‌సింగ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలన్నారు.

బాధితురాలిని పరామర్శించిన ఎమ్మెల్యే

ఉట్నూర్‌రూరల్: హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జైనూర్ బాధితురాలిని ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మ భొజ్జు ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి మహిళ ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. మెరుగైన వైద్యాన్ని అందించాలని డాక్టర్లకు సూచించారు. బాధిత కుటుంబానికి రూ. 10వేల ఆర్థిక సాయం అందచేశారు.

ఎస్సీ రిజర్వేషన్‌లో క్రిమిలేయర్ అమలు చేయాలి



గ్రామస్తులతో మాట్లాడుతున్న సిద్దార్థ

నేరడిగొండ: ఎస్సీ రిజర్వేషన్లలో క్రిమిలేయర్ విధానం అమలు చేస్తూ పార్లమెంట్‌లో చట్టం చేయాలని దళిత వికాస సమితి రాష్ట్ర అధ్యక్షుడు కిన్నెర సిద్ధార్థ అన్నారు. బుధవారం పాదయాత్రలో భాగంగా నారాయణపూర్ గ్రామంలో మాట్లాడారు. 70 ఏళ్లుగా దేశంలో ఎస్సీలకు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో అమలవుతున్న రిజర్వేషన్ ఫలాలు కేవలం 3 శాతం మందికే దక్కాయన్నారు. ఎస్సీ రిజర్వేషన్ ఫలాలు అందరికి దక్కాలనే ఉద్దేశంతో పాదయాత్ర చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో దళిత వికాస సమితి నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

తీజ్ ప్రాముఖ్యత ప్రతిఒక్కరికీ తెలియాలి



యువతులు, చిన్నారులతో ఆడే గజేందర్

నేరడిగొండ: తీజ్ పండగ ప్రాముఖ్యత ప్రతి ఒక్కరికీ తెలిసి ఉండాలని కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ అన్నారు. బుధవారం మండలంలోని మాట్‌లొద్ది గ్రా మంలో నిర్వహించిన తీజ్ ఉత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గోధు మ మొలకల బుట్టలు నెత్తిన వేసుకొని పాటలు పాడుతూ యువతులు, చిన్నారులతో ఆడిపాడారు. కార్యక్రమంలో నాయకులు ఆడే వసంత్‌రావు, ప్రఫుల్‌చందర్ రెడ్డి, బద్దం పోతారెడ్డి, రాజారెడ్డి, జాదవ్ కపిల్, రమేశ్ పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరిస్తాం

నేరడిగొండ: నియోజకవర్గంలో సమస్యలు పరిష్కరిస్తామని కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ అన్నారు. బుధవారం మండలంలోని కుంటాల గ్రామాన్ని సందర్శించారు. ముందుగా గ్రామస్తులు ఆయనకు స్వాగతం పలికి సత్కరించారు. గిరిజన బాలికల ఆశ్రమోన్నత పాఠశాలను సందర్శించారు. పాఠశాలలోని సమస్యలను ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు వివరించారు. వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ హయాంలో విద్యారంగం నిర్వీర్యం

ఆదిలాబాద్‌టౌన్: రాష్ట్రంలో విద్యారంగం నిర్వీర్యం అవుతుందని ఏబీవీపీ నగర కార్యదర్శి కార్తీక్ అన్నారు. బుధవారం ఆదిలాబాద్ పట్టణంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఇటీవల జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశాలపై చర్చించారు. ప్రస్తుత పాలకులు విద్యారంగాన్ని పూర్తిగా విధ్వంసం చేస్తున్నారని మండిపడ్డారు. ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ పథకాలకు తూట్లు పొడిచే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. రూ.7,500 కోట్ల స్కాలర్‌షిప్‌లు, ఫీజురీయింబర్స్‌మెంట్ పెండింగ్‌లో ఉన్నాయన్నారు. అవినీతి, భూకబ్జాదారులపై సీబీఐ విచారణ చేపట్టాలన్నారు. సమావేశంలో నగర సంయుక్త కార్యదర్శి అరుణ్, సాయి, నిఖిల్ పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు నిరంతరం చేపట్టాలి



పరిశీలిస్తున్న జెడ్పీ సీఈవో జితేందర్ రెడ్డి

తాంసి: ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య పనులు నిరంతరం చేపట్టాలని జెడ్పీ సీఈవో జితేందర్ రెడ్డి అన్నారు. బుధవారం భీంపూర్ మండలంలోని నిపాని, తాంసి మండలంలోని సావర్గాం గ్రామాల్లో పర్యటించారు. గ్రామాల్లో చేపడుతున్న పారిశుధ్య పనులను పరిశీలించారు. వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించి, విద్యార్థులతో మాట్లాడారు. ఆయన వెంట ఎంపీడీవోలు మోహన్ రెడ్డి, గోపాలకృష్ణ రెడ్డి, ఎంపీవో అతుల్ కుమార్, ఏపీవో సంగీత, ఈసీ నరేందర్, పంచాయితీ కార్యదర్శి సునీత పాల్గొన్నారు.

అటవీశాఖ కార్యాలయం ఎదుట ఆందోళన



కార్యాలయం ఎదుట బైఠాయించిన ఆదివాసీలు

బోథ్: మండల కేంద్రంలోని అటవీశాఖ కార్యాలయం ఎదుట వజ్జర్ గ్రామస్తులు బుధవారం ఆందోళన చేపట్టారు. నాగుగూడ నుంచి మహదుగూడ వరకు త్రీఫేజ్ విద్యుత్ లైన్ పనులు అటవీ అధికారులు నిలిపివేయడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. 2018లో నాగుగూడ, జైతుగూడ కేశవ్‌గూడ, మహదుగూడ గ్రామాలకు త్రీఫేజ్ విద్యుత్ లైన్ మంజూరైంది. అప్పట్లో నాగుగూడ వరకు త్రీఫేజ్ విద్యుత్‌లైన్‌ను నిర్మించిన కాంట్రాక్టర్ పనులను మధ్యలో ఆపివేశారు. ఇటీవల నాగుగూడ నుంచి మహదుగూడ గ్రామానికి త్రీఫేజ్ విద్యుత్‌లైన్ పనులను ప్రారంభించారు. ఈ క్రమంలో పనులను అటవీ శాఖ అధికారులు అడ్డుకున్నారు. దీంతో అటవీశాఖ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు.

క్రమం తప్పకుండా టీకాలు వేయించాలి

ఆదిలాబాద్‌టౌన్: పిల్లలకు క్రమం తప్పకుండా వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి వైసీ శ్రీనివాస్ అన్నారు. రిమ్స్ ప్రసూతి వార్డులో ఇమ్యునైజేషన్ కార్యక్రమాన్ని బుధవారం తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. పిల్లలకు సక్రమంగా వ్యాధి నిరోధక టీకాలు ఇస్తున్నారా? లేదా? అని వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వ్యాక్సిన్ కోల్డ్ చైన్ మేనేజర్ సాయి ప్రీతి, సచిన్, సూపర్ వైజర్ సుగుణ, శశికళ, ప్రియదర్శిని, హేమలత పాల్గొన్నారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలి

బోథ్: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని, ఇందుకోసం ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు కృషి చేయాలని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణ అధికారి కలిందిని అన్నారు. బుధవారం మండంలోని పొచ్చెర గ్రామంలో పర్యటించారు. ఈసందర్భంగా గ్రామంలో పారిశుధ్య కార్యక్రమాలను పరిశీలించారు. బ్లీచింగ్, ఫాగింగ్‌ను చేపట్టాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. ఎంపీడీవో జీవన్ రెడ్డి, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

దొడ్డి కొమురయ్య త్యాగం చిరస్మరణీయం

ఎదులాపురం: తెలంగాణ సాయుధ పోరాటంలో వీరమరణం పొందిన దొడ్డి కొమురయ్య త్యాగం చిరస్మరణీయమని సీపీఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో సీపీఎం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవ కార్యక్రమంలో కొమురయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. నాటి సాయుధ పోరాటంలో కొమురయ్య తొలి అమరుడని, ఆయన మరణం ప్రజలను ఎంతో కలచివేసిందన్నారు. కార్యక్రమంలో నాయకులు బండి దత్తాత్రే, లింగాల చిన్నన్న, స్వామి, పోచన్న, స్వామి, మంజుల, సుజాత పాల్గొన్నారు.

రైతులకు పరిహారం అందించాలి

తలమడుగు: అకాల వర్షాల కారణంగా పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని రైతులు డిమాండ్ చేశారు. బుధవారం తహసీల్దార్ రాజ్‌మోహన్‌కు వినతిపత్రం అందజేశారు. తలమడుగు, కొత్తూరు, కుచులాపూర్, డోర్లి గ్రామాల్లో పంటపోలాలు కొట్టుకుపోయాయని వాపోయారు. దాదాపు 500 ఎకరాలపైగా పంట నష్టం వాటిల్లిందన్నారు. అధికారులు సర్వే నిర్వహించి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో రైతులు పద్మకర్ రెడ్డి, మల్లేష్, రాం రెడ్డి పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన

ఆదిలాబాద్‌టౌన్: ఎలక్ట్రిషియన్ సిబ్బంది అగ్ని ప్రమాదాలపై అవగాహన ఉండాలని జయత్రం అన్నారు. బుధవారం న్యాక్ ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్న ఎలక్ట్రిషియన్ సిబ్బందికి అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ప్రమాదాలు జరిగి నప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం న్యాక్ శిక్షకుడు ద్యావంత్ రమేశ్ మాట్లాడుతూ.. శిక్షణతో పాటు రూ.4500 స్టైఫండ్ ఇవ్వ డం జరుగుతుందన్నారు. ఫైర్‌మెన్‌లు అన్వేష్, కార్తీక్, సాయిప్రసాద్, పృథ్వీరాజ్, శంభోజి పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం



మందులు పంపిణీ చేస్తున్న సిబ్బంది

నేరడిగొండ: వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యంగా ఉండ వచ్చని హెల్త్ సూపర్‌వైజర్ దేవేందర్ అన్నారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని కుప్టి గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలంలో నీరు నిల్వ ఉండడంతో దోమలు వృద్ధి చెంది వ్యాధులకు కారణమవుతాయన్నారు. గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ మందుల రమేశ్, వీడీసీ చైర్మన్ శ్రీనివాస్, వెంకటరమణ, హెచ్‌ఏ సాయన్న, వైష్ణవి, ఆశ కార్యకర్త గంగామణి, అంగన్‌వాడీ కార్యకర్త లక్ష్మి పాల్గొన్నారు.

రైతులకు పరిహారం అందేలా కృషి

- ఎమ్మెల్యే పాయల్ శంకర్



పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

బేల: పెన్‌గంగ బ్యాక్ వాటర్‌తో దెబ్బతిన్న పత్తి, సోయా, కంది పంటల బాధిత రైతులకు పరిహారం అందేలా కృషి చేస్తానని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. బుధవారం మండలంలోని కోగ్దూర్, మాంగ్రుడ్ రెవెన్యూ గ్రామాల శివారులో దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. బాధిత రైతులతో మాట్లాడి, నష్టంపై ఆరా తీశారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఫసల్ బీమా అమలు చేస్తే రైతులకు కష్టాలు ఉండేవి కావన్నారు. ఆయన వెంట కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు ముకుందర్‌రావు, మండల అధ్యక్షుడు దత్తా నిక్కమ్, తాక్రే సందీప్, రాకేశ్, ఇంద్రశేఖర్, రామెల్లి మోరేశ్వర్, తాక్రే విలాస్ పాల్గొన్నారు.

కొలతలు, గణనల్లో తప్పిదాలు



రికార్డులు పరిశీలిస్తున్న డ్వామా ఏపీడీ అధికారి

బేల: ఉపాధి పనుల్లో కొలతలు, గణనల్లో తప్పిదాలు గుర్తించామని జిల్లా డ్వామా ఏపీడీ కుటుంబరావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఏప్రిల్ 2023 నుంచి మార్చి 2024 చేపట్టిన ఉపాధి పనులపై చేపట్టిన సామాజిక తనిఖీపై ప్రజావేదిక నిర్వహించారు. 37గ్రామ పంచాయతీల్లో రూ.3.63 కోట్ల వ్యయంతో చేపట్టిన ఉపాధి పనులు, కొలతలు, గణనలు, లోటు పాట్లపై సామాజిక తనిఖీ బృందం విలేజ్ సోషల్ ఆడిటర్‌లు, డీఆర్‌పీలు, ఎస్ఆర్‌పీ చదివి వినిపించారు. ఏపీడీ కృష్ణారావు, ఎంపీడీవో మహేందర్‌కుమార్, ఈజీఎస్ ఏపీవో వెంకటరమణ పాల్గొన్నారు.

పారిశుధ్యంపై నిర్లక్ష్యం చేయవద్దు

తలమడుగు: పారిశుధ్యంపై నిర్లక్ష్యం చేయవద్దని డిప్యూటీ డీఎంహెచ్‌వో సాధన అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఒకరికి డెంగ్యూ జ్వరం సోకడంతో వారి కుటుంబసభ్యులను పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. గ్రామాల్లో ఎలాంటి వ్యాధుల సోకిన వెంటనే వైద్య సిబ్బందిని సంప్రదించాలన్నారు. అనంతరం ప్రథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి శ్రీనివాస్, ఎంపీడీవో చంద్రశేఖర్, వైద్యాధికారి హరీశ్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

మట్టి వినాయకులను పూజించాలి

ఆదిలాబాద్‌టౌన్: పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్ (పీఓపీ)తో తయారు చేసిన వినాయకులను పూజించవద్దని, మట్టి వినాయకులనే పూజించాలని ఆదిలాబాద్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల ప్రిన్సపాల్ అతీఖ్ బేగం అన్నారు. బుధవారం కళాశాలలో ఎన్‌సీసీ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ కేర్‌టేకర్ చంద్రకాంత్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

బోథ్: కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(యూ) మండలంలోని పుల్లారా గ్రామానికి చెందిన మర్సకోల కృష్ణ అనే విద్యార్థి రాయచూర్‌లోని ఐఐఐటికి ఎంపికయ్యాడు. కాగా ఆర్థిక భారంతో చదువుకోవడానికి ఇబ్బంది పడుతున్న ఆదివాసీ విద్యార్థి కృష్ణకు బోథ్ జూనియర్ సివిల్ కోర్టులో ఏజీపీగా విధులు నిర్వహిస్తున్న పంద్రం శంకర్ రూ. 5 వేలు, పట్నాపూర్ గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు తొడసం భూమన్న రూ. 5 వేలను బుధవారం అందజేశారు.

దళారులను ఆశ్రయించవద్దు

నార్నూర్: బ్యాంకు ఖాతాదారులు దళారులను ఆశ్రయించవద్దని ఎస్‌బీఐ బ్యాంక్ మేనేజర్ రవీందర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని బ్యాంక్ ఆవరణంలో ఖాతాదారులకు అవగాహన కల్పించారు. బ్యాంకింగ్ వ్యవస్థ గురించి, దళారి వ్యవస్థను అరికట్టడానికి తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మెడికల్ ఆఫీసర్లు నరేందర్, సుజాత అన్నారు. బుధవారం ఆదిలాబాద్ పట్టణంలోని బంగారిగూడలోని ఆదిలాబాద్ రూరల్ కేజీబీవీ విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. ఫార్మాసిస్టు విజయలక్ష్మి, ల్యాబ్ టెక్నిషియన్ సురేందర్, అప్తాల్మాజిస్టు రవీందర్, కేజీబీవీ ప్రత్యేకాధికారి కవిత పాల్గొన్నారు.

చిత్ర కళాకారులను ఆదుకోవాలి

ఉట్నూర్‌రూరల్: ప్రభుత్వం చిత్ర కళాకారులను ఆదుకోవాలని తెలంగాణ ఆర్టిస్టుల సంక్షేమ సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు తాళ్లపెల్లి రాజేశ్వర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో మాట్లాడారు. ఆర్టిస్టుల సంక్షేమానికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.

క్లుప్తంగా

రాకపోకలు బంద్

ఇచ్చోడ: మండలంలోని మారుమూల గిరిజన గ్రామమైన బావోజీపేట్ రోడ్డు కోతకు గురైంది. దీంతో నాలుగు రోజులుగా రాకపోకలు నిలిచిపోయాయి. సిరిచెల్మ నుంచి 6 కిలోమీటర్ల దూరంలో ఉన్న భావోజీపేట్‌కు మట్టి రోడ్డు ఉంది. పలు చోట్ల కల్వర్టులు కోతకు గురయ్యాయి. కనీసం ఎడ్లబండ్లు కూడా వెళ్ల లేని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం స్పందించి కోతకు గురైన రోడ్డుకు మరమ్మతులు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

డిగ్రీ ప్రవేశాలకు చివరి అవకాశం

ఇచ్చోడ: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరేందుకు ఆసక్తిగల విద్యార్థులకు చివరి అవకాశం ఇస్తున్నట్లు ఇచ్చోడ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సెప్టెంబర్ 4 నుంచి 9 వరకు దోస్త్ స్పెషల్ ఫేజ్‌లో రిజిస్ట్రేషన్, వెబ్ ఆప్షన్ ద్వారా విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఇచ్చోడ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పలు గ్రూపులలో ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. విద్యార్థులు ఈఅవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు

ఇంద్రవెల్లి: మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని ఎస్సై దుబ్బక సునీల్ హెచ్చరించారు. బుధవారం పోలీస్‌స్టేషన్‌లో ఇటీవల కాలంలో మద్యం తాగి వాహనాలు నడిపి పట్టుబడిన వాహనదారులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. పోలీస్ సిబ్బంది ఉన్నారు.

నలుగురికి ఆర్ఐగా బాధ్యతలు

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ జిల్లా రెవెన్యూశాఖలో పనిచేస్తున్న పలువురు సీనియర్ అసిస్టెంట్లు, గిర్దావర్లకు స్థానచలనం కలిగింది. మొత్తం ఎనిమిది మందిని బదిలీ చేయగా.. అందులో నలుగురు సీనియర్ అసిస్టెంట్లను గిర్దావర్ (ఆర్ఐ)లుగా నియమించారు. గిర్దావర్లుగా రెండేళ్ల సర్వీస్‌ను పూర్తి చేసుకున్న మరో నలుగురిని సీనియర్ అసిస్టెంట్లుగా బదిలీ చేశారు. మేరకు జిల్లా కలెక్టర్ రాజర్షి షా బుధవారం ఉత్తర్వులను జారీ చేశారు.

విద్యుత్ మీటర్ కనెక్షన్ కోసం దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌రూరల్: ఇంటికి విద్యుత్ మీటర్ లేని బీపీఎల్ కుటుంబాలకు రూ. 938కి (18 శాతం జీఎస్టీ కలుపుకోని)కి విద్యుత్ మీటర్ కనెక్షన్ అందించడం జరుగుతుందని, అలాంటి వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యుత్ శాఖ అధికారి తిరుపతి రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశం కేవలం ప్రస్తుతం ఇంటికి విద్యుత్ మీటర్ లేని వారికి మాత్రమే వర్తిస్తుందన్నారు.

బోథ్: బీపీఎల్ కుటుంబాలకు కేవలం రూ. 938 (18 శాతం జీఎస్‌టీ కలిపి)లకే విద్యుత్ మీటర్లు అందిస్తామని బోథ్ ఇన్‌చార్జి ఏఈ వెంకటేశ్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. ఈనెల 15 వరకు మీటర్లను ఇచ్చే కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఇంటి పన్ను రశీదు, ఆధార్ కార్డు, ఫొటో, రేషన్ కార్డుతో సంప్రదించాలన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలో బుధవారం విద్యార్థులకు క్వీజ్ పోటీలు నిర్వహించారు. ఆర్‌బీఐ స్థాపించి 90 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా విద్యార్థులకు పోటీలు నిర్వహించినట్లు ఎస్‌బీఐ బ్యాంక్ మేనేజర్ ఉత్పల్‌కుమార్‌దాం తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అతీఖ్ బేగం, వైస్ ప్రిన్సిపాల్ గణపతి రఘు పాల్గొన్నారు.

'ఐకమత్యంతోనే హిందూ దేశం సాకారం'

ఆదిలాబాద్: హిందువులందరి ఐకమత్యంతోనే హిందూ దేశం సాకారం అవుతుంది అని గాయకురాలు కవి సింగ్ అన్నారు. బుధవారం హిందూ జన జాగృతి పాదయాత్రను పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా పట్టణంలోని శ్రీ మహాగణపతి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. హిందూ దేశ సంస్కృతి, చరిత్ర ఎంతో గొప్పవని వాటిని పరిరక్షించుకోవాల్సిన ఆవశ్యకత అందరిపై ఉందన్నారు. హిందూ సంఘాల నాయకులు ఆర్యన్ మహరాజ్, నరేందర్ ఉన్నారు.

నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థులు వివిధ రంగాల్లో నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అతీఖ్ బేగం అన్నారు. బుధవారం కళాశాలలో తెలంగాణ అకాడమి స్కిల్, నాలెడ్జ్ సెంటర్ ద్వారా విద్యార్థులకు ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆసిఫాబాద్ రీజినల్ హెడ్ సాయికుమార్ పాల్గొని విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు కష్టపడి చదివి అనుకున్న లక్ష్యాలను చేరుకోవాలన్నారు. ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టాస్క్ మెంటర్ చైతన్య కృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.